TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 263 | బుధవారం, అక్టోబర్ 14, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

ARK MEDIA
SUBSCRIBE

విలేఖరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...
నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..
సంప్ర : 94932 72754

## మూసీకి కొత్త రూపు.. తొలి దశకు టెండర్లు

**21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు**
**ఏడీబీ నుంచి ప్రాజెక్టుకు ఆమోదం**
**రూ.7,345 కోట్లతో రెండు ప్యాకేజీలు**
**నవంబర్ 26 వరకు టెండర్ల దాఖలుకు గడువు**
**నది ప్రక్షాళన, సుందరీకరణతో ఐకానిక్ బ్రిడ్జి**



**హైదరాబాద్, అక్టోబర్ 13 (నేటి ప్రభాత దర్శిని) :**

హైదరాబాద్ నగరాన్ని సుందరంగా మార్చే మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి అనుమతులు రావడంతో తొలి దశ పనులకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులను రెండు ప్యాకేజీల కింద చేపట్టనున్నారు. ఎంఆర్‌డీసీఎల్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అక్టోబర్ 15 నుంచి టెండర్ పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. టెండర్లు దాఖలు చేయడానికి నవంబర్ 26ని చివరి తేదీగా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి అర్హత కలిగిన సంస్థను ఎంపిక చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. తొలి దశ పనుల కోసం రూ.7,345 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. ఇందులో భాగంగా జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఈసా నదిపై 9.8 కిలోమీటర్లు, జోన్-1బీ కింద గండిపేట నుంచి బాపుఘాట్ వరకు మూసీపై 11.2 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపడతారు. నది ప్రక్షాళన, వరద నివారణకు రిటైనింగ్ గోడల నిర్మాణం, సుందరీకరణ, రహదారులు, వంతెనలు, రబ్బర్ డ్యామ్‌లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఐకానిక్ కేబుల్ స్టేడ్ వంతెన నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మొత్తం 55 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4,500 కోట్ల వరకు రుణం అందించనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. డిసెంబర్ 2027 నాటికి తొలి దశ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, పరిహారంపై కొందరు స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు వేగవంతం కానున్నాయి.

## గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం

**గెలుపు బాధ్యత మంత్రులు, ఇన్‌చార్జిలదే**
**ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి**
**రెండు ఎమ్మెల్సీ స్థానాలపై సీఎం దృష్టి**
**గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి**
**ఖర్గే, ప్రియాంకతో కాంగ్రెస్ నేతల భేటీలు**

**హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (నేటి ప్రభాత దర్శిని):**

గ్రాడ్యుయేట్స్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులు, నియోజకవర్గాల వారీగా నియమితులైన పార్టీ ఇన్‌చార్జిలదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్స్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపైనే చర్చ జరిగింది. అభ్యర్థులు ఎవరైనా వారిని గెలిపించే బాధ్యత మంత్రులే తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్, ఖమ్మం--వరంగల్--నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని, గెలుపోటముల ప్రభావం రాబోయే ఎన్నికలపైనా ఉంటుందని అన్నారు.



రెండు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలు ఆరు ఉమ్మడి జిల్లాలు, 70కి పైగా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉన్నాయని వివరించారు. అందువల్ల ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఇతర మంత్రులు కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఆరు ఉమ్మడి జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకునేలా తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ఇన్‌చార్జిలను నియమించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. వారు వెంటనే రంగంలోకి దిగి గ్రాడ్యుయేట్ ఓటర్ల పేర్ల నమోదు బాధ్యతలు చేపట్టాలని తెలిపారు. ఖర్గేతో ముఖ్య నేతల భేటీ అనంతరం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రభుత్వ విప్‌లు, పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ప్రియాంక గాంధీ నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లారు. ఈ సందర్భంగా 'సర్' ఉద్యమంలో పార్టీ రాష్ట్ర నాయకులు చూపిన చొరవను ప్రియాంక గాంధీ అభినందించారు.

## ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

**ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి**
**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బోయినపల్లి మండలం వరదవెల్లిలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్**



**నేటి ప్రభాతదర్శిని బోయినపల్లి, అక్టోబర్ -13**

దీర్ఘకాలిక ఆదాయం సమకూరే ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో తరిగొప్పుల మురళి అనే రైతు 4 ఎకరాల 20 గుంటల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు. మొక్కలు నాటేందుకు వీ బీ జీ రామ్ జీ కింద కూలీలతో గుంతలు తవ్వించారు. అలాగే మొక్కలు నాటించారు. మూడు ఏండ్ల పాటు కూలీలు కలుపు మొక్కల నిర్మూలన, నీటిని పట్టి మొక్కలను సంరక్షించే పనులు చేయనున్నారని అధికారులు తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘ కాలం పాటు ఆదాయం సమకూరుతుందని వివరించారు. జిల్లాకు సరిహద్దులోని సిద్దిపేట జిల్లాలో నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో దృష్ట్యా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు.

**పామ్ పాండ్ పనుల పరిశీలన..**

రత్నంపేట గ్రామపంచాయతీ పరిధిలో రైతు కౌటగాని పద్మ ఆయిల్ పామ్ తోటలో పామ్ పాండ్ నిర్మించుకుంటుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత మంది కూలీలకు ఉపాధి దొరుకుతుందని, ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారని ఆరా తీశారు? జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం జలసిరి కింద పామ్ పాండ్, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీచార్జ్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రైతులు, గృహ నిర్మాణదారులు తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. దీంతో వాన నీటిని సంరక్షించవచ్చని, భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫోద్దీన్, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## మంథనిలో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**గోదావరి పుష్కర ఘాట్ వద్ద 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలి**
**నాలుగు రోజుల్లోగా రోడ్డు పనుల డిజైన్లను ఖరారు చేయాలి**
**మార్చి 2027 నాటికి సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణం పూర్తి చేయాలి**
**50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి**
**మంథనిలో వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**నేటి ప్రభాతదర్శిని మంథని, 2026 అక్టోబర్-13:**

మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, మంథని--రామగుండం రహదారిపై హెలిప్యాడ్ నిర్మాణ పనులు, సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం, నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు, రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను తొలగించే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ వద్ద నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తూ, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. మంథని--రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్‌ను గోదావరి పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్చి 2027 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలి.**

**గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.**

**డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి.**

**నేటి ప్రభాత దర్శిని, అక్టోబర్ 13 (ముస్తాబాద్- ప్రతినిధి):**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం రోజున ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలనిసూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించిపరిశీలించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఇక్కడ డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు , ఎస్.ఐ జ్యోతి , సిబ్బంది ఉన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం





**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**(నేటి ప్రభాత ధర్శిని ప్రతినిధి ) ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 13:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి : అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్





**నేటి ప్రభాతదర్శిని సిద్దిపేట అక్టోబర్ 13 :**

దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 23 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, తేమ శాతం కలిసి యంత్రాలు సిద్ధం చేయాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి దుర్గం ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, సిసిఐ అధికారులు, పత్తి మిల్లర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్డ సరఫరా టెండర్ల సాంకేతిక బిడ్ల పరిశీలన పూర్తి



**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్. 14.26**

కామారెడ్డి జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్డ సరఫరా చేసేందుకు నిర్వహించిన టెండర్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన మంగళవారం సాంకేతిక బిడ్ల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టెండర్లలో పాల్గొన్న సంస్థలు, సరఫరాదారులు సమర్పించిన సాంకేతిక బిడ్లు, సంబంధిత ధ్రువపత్రాలను నిర్దేశిత అర్హత ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. తదుపరి టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్డ సరఫరా ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# భిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు 90 దరఖాస్తులు

**బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు అక్టోబర్ 16న లక్కీడ్రా**

**90 దరఖాస్తులు స్వీకరణ జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి**

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్ 14**



బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 12వ తేదీన ముగిసిందని జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం 90 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. బార్ కేటాయింపు ప్రక్రియను ఈ నెల 16వ తేదీన ఉదయం 11.00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమకు అధికారులు జారీ చేసిన రసీదులతో అదే రోజు ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని ప్రధాన సమావేశ మందిరానికి హాజరు కావాలని జిల్లా ఆబ్కారీ అధికారి సూచించారు.

# అన్నదానం వేయి యజ్ఞాల పుణ్యఫలితం

**శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో మంగళవారం సందర్భంగా అన్నప్రసాద వితర**

**2016 నుండి ప్రారంభం**

**వేలాది మంది ఆకలిని తీర్చుతున్న అన్న ప్రసాద కార్యక్రమం**



**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్. 14.26**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ లో గల ఈ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయం కల్కి ఆలయంలో 2016 నుండి ప్రతి మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్,డాక్టర్ బాలు తెలియజేయడం జరిగింది. ఈ రోజు ఆలయంలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్,డాక్టర్ బాలు మాట్లాడుతూ వేలాదిమందికి ఆకలిని తీర్చే మహా యజ్ఞంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వేయి యజ్ఞాల పుణ్యఫలితం అన్న ప్రసాద వితరణతో కలుగుతుందని దాతలు ఈ కార్యక్రమానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యుల పుట్టినరోజు,పెళ్లి రోజు సందర్భంగా అన్నదానానికి దాతలు ముందుకు రావాలని అన్నారు అన్నదానం చేయాలనుకునే దాతలు 9849601438 నెంబర్ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం నారాయణ,కొమిరిశెట్టి దిగంబర్,ఎర్రం వినోద్, ప్రభాకర్,స్వరూప,అద్విక్ సాయి,సాయి అద్విత లు పాల్గొనడం జరిగింది.

# పండుగకు ఏర్పాట్లు చేస్తున్నాం : సర్పంచ్ శంకర్



నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.

తెలంగాణ సాంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ పండగ కు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు బీర్కూరు మండలం దామరంచ గ్రామ సర్పంచ్ బోయిని శంకర్ అన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామ చెరువు వద్ద, బతుకమ్మ నిమజ్జనాలు చేసే కుంటల వద్ద ఏర్పాట్లు చేశారు. పారిశుధ్య సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇ . శంకర్, నాయకుల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలి

**గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

**డయల్ 112 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి**

**ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**




(నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి ) ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 13 :

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం రోజున ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు , ఎస్.ఐ జ్యోతి , సిబ్బంది ఉన్నారు.

# సార్ కు నిరసన గా చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న వారిపై కేంద్ర ప్రభుత్వం విచక్షణ లేని దాడులకు పూనుకోవడం సిగ్గు చేటు. సిపిఎం జిల్లా కార్యదర్శి. చంద్రశేఖర్ ధ్వజం

**ఆడపిల్లలపై, యువకులపై, మేధావులపై ,అడ్వకేట్ల పైన, పత్రిక విలేకరుల పైన బిజెపి ఆర్ఎస్ఎస్ బజరంగధల్ గుండాలు పోలీసులు విచక్షణ లేని దాడులకు పూనుకోవడం సిగ్గుచేటు**

**బిజెపి గెలుపు కోసమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పనిచేస్తున్నారు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**

కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. 14.26

భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించే ఓటు హక్కును ఎస్ ఐ ఆర్ పేరుతో తొలగించడం రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందని తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని దీనికి కారణమైన ఎలక్షన్ చీఫ్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే పదవిలో నుండి వైదొలగాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి యువజన ప్రజా సంఘాలు కాంగ్రెస్ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీ నాయకులు చేస్తున్న ఆందోళనలపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్టు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కుల పైన దాడి చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు ఎన్నికల కమిషనర్ బిజెపి గెలుపు కోసం ఓట్లు తొలగింపును చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ధర్నాని విచ్ఛిన్నం చేయడానికి ఢిల్లీ నగరంలో 50 వేల మంది పారా మిలటరీ పోలీస్ యంత్రాంగంతో దిగ్బంధనం చేశారని 58 మెట్రో రైల్వే స్టేషన్లను మూసివేసారని, బయట నుండి వస్తున్న రైళ్ల రాకపోకలను చేసి ప్రజా రవాణాకు ఆటంకం కల్పించడం చూస్తే మోడీ ప్రభుత్వం మరో ఎమర్జెన్సీ పాలనను తలపించేలా చేశారని అన్నారు బిజెపి నయా ఫాసిస్ట్ విధానాలను ముక్తకంఠంతో దేశమంతా ఖండిస్తున్నదని ఓటు హక్కు కోసం అడుగుతున్న విద్యార్థి యువజన మేధావులను విచక్షణారహితంగా ప్రైవేట్ ఆర్ఎస్ఎస్ వీహెచ్పీ గుండాలతో భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమైనదని చెప్పారు నేమ్ ప్లేట్ లేని పోలీస్ డ్రెస్సులను వేసుకున్న వారు ఆడపిల్లలు అని కూడా చూడకుండా బట్టల చింపడం కిడ్నాప్ చేయడం ప్రైవేటు వాహనాలలో బంధించి వేధించడం కాక్రోచ్ జనతా పార్టీ అధినేతను ఫ్లైట్లోనే నిర్బంధించడం మీడియా మహిళలపై దాడులకు పూనుకోవడం ఇంటర్నెట్ ఫోన్ సౌకర్యాన్ని బ్లాక్ చేయడం సిపిఎం ప్రజా ప్రతినిధులను విచక్షణ రహితంగా కొట్టడం పార్టీ ఆఫీసుల మీద మూకుమ్మడి దాడులు చేసి నాయకులను కార్యకర్తలను అరెస్టు చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి పౌరుడు నిరసనను తెలియజేసే హక్కు ఉందని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై ఎలాంటి నిర్బంధాన్ని ప్రయోగించిన వారందరిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను విధులలో నుండి తప్పించాలని దాడులకు బాధ్యులైన వారందరినీ ఉద్యోగాల నుండి తీసివేయాలని డిమాండ్ చేస్తున్నాం. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు వెంకట్ గౌడ్, మోతి రామ్ నాయక్ ,కొత్త నరసింహులు, ముదం అరుణ్ కుమార్ ,రేణుక ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ సంస్కృతికి, మహిళల ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

ముఖ్యంగా వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఏడు రోజుల పాటు నిర్వహించడం వెనుక స్థానిక ఆచారం, భక్తి, సంప్రదాయం, సామూహికఐక్యత వంటి అంశాలు ఉన్నాయి. ఈ వేడుకలు పూలను పూజించే ప్రక్రియ మాత్రమే కాకుండా, ప్రకృతిని ఆరాధించడం, కుటుంబ క్షేమాన్ని కోరుకోవడం, మహిళల సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టడం వంటి విశేషాలను కలిగి ఉన్నాయి.

### బతుకమ్మ పండుగ అంటే ఏమిటి?

బతుకమ్మ అంటే "అమ్మా, బతుకు" లేదా "అమ్మా, మమ్మల్ని చల్లగాచూడు" అనే భావంతో అనుసంధానించ బడిన ప్రజా సంప్రదాయం. తెలంగాణలో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడి పూజిస్తారు.ప్రకృతి ప్రసాదించిన పూలకు గౌరవం ఇవ్వడం.కుటుంబాలు, పంటలు, పశుసంపద సుభిక్షంగా ఉండాలని కోరుకోవడం.మహిళల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందించడం.తెలంగాణ జానపదపాటలు, ఆచారాలు, సంప్రదాయాలను తరతరాలకు అందించడం.

### వేములవాడలో ఏడు రోజుల వేడుకల ప్రత్యేకత

వేములవాడలో సద్దుల బతుకమ్మను ఏడు రోజుల పాటు నిర్వహించే ఆచారం స్థానికంగా పాటించే ప్రత్యేక సంప్రదాయంగా గుర్తించ బడుతోంది. తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయి. అయితే ప్రాంతాన్ని బట్టి వేడుకల నిర్వహణ, పేర్లు, రోజువారీ ఆచారాల్లో తేడాలు ఉండవచ్చు.



# సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నానేబియ్యం బతుకమ్మ వేడుకలు.....





**ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**మెప్మా, మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మహిళలు, ఉద్యోగులు**

నేటి ప్రభాతదర్శిని ఖమ్మం, అక్టోబర్ -13:

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో నాల్గవ రోజు నానేబియ్యం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ వేడుకలు కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

# పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలి

**యువజన, అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్**

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ అక్టోబర్ 13, 2026:

రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అభివృద్ధికి అవసరమైన నివేదిక సిద్ధం చేయాలని యువజన, అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయం నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పర్యాటకశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలోని పర్యాటక, చారిత్రాత్మక ప్రదేశాలు, జలపాతాలు, స్మారక ప్రాంతాలను గుర్తించి అవసరమైన మౌలికవచతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, డి.పి.ఆర్. లు సిద్ధం చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్న సద్దుల బతుకమ్మ సంబరాలను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, ముగింపు రోజున అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక, చారిత్రాత్మక, స్మారక ప్రదేశాలు, జలపాతాలు, ఇతర పర్యాటక ప్రాంతాలను గుర్తించి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో బతుకమ్మ సంబరాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేసి ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

